

బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తున్న క్రాఫ్టు టీచర్ మేరీ సౌభాగ్యం

**వాడేసిన వాటిని వారు పాడేయడం లేదు .. వాటిని అద్భుత రూపాలుగా ఆవిష్కరిస్తున్నారు. చేయి తిరిగిన కళాకారులు కాకపోయినా నిత్య శిక్షణతో కళ్లు చెదిరే ఆకృతులను తయారు చేస్తున్నారు. ప్లాస్టిక్ కంచాలు .. గ్లాసులు .. సీడీలు ..మట్టి కుండలు ..స్పాంజి ముక్కలు వారి చేతుల్లో కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. చినగంజాం లోని కస్తూర్బాగాంధీ విద్యార్థినులు తమకు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు.**

# వ్యర్థాలతో అద్భుత అర్థాలు

- విద్యార్థినులకు శిక్షణ
- ప్రముఖుల నుంచి ప్రశంసలు



ఐస్ పుల్లలు, ప్లాస్టిక్ కాగితాలతో అందమైన టేబుల్ ఫ్లవర్‌వాజ్

చినగంజాం, న్యూస్‌టుడే:

చినగంజాంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థినులు అందమైన ఆకృతులు తయారుచేస్తూ మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇక్కడ సుమారు 200 మంది చదువుకుంటున్నారు. వీరిలో చాలామంది బొమ్మలు, పువ్వులు, తయారీ చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. క్రాఫ్టు ఉపాధ్యాయిని జంగా మేరీ సౌభాగ్యం శిక్షణలో వీరు రాటుదేలుతున్నారు. గత ఆరేళ్లుగా ఆమె ఎంతో శ్రమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇళ్లల్లోని షోకేసుల్లో పెట్టుకునే రకరకాల పువ్వులను, చూడముచ్చటైన బొమ్మలను, వస్తువులను తయారు చేస్తున్నారు.

### కావేవీ అనర్హం...

వాడేసిన ప్లాస్టిక్ పేపర్లు, మంచినీటి సీసాలు, ఐస్ పుల్లలు . . సీడీలతో విభిన్నమైన ఆకృతులను తయారుచేస్తున్నారు. ఇవే కాక టీ కప్పులు, శిరస్త్రాణంలోని స్పాంజి, విందుల్లో వాడేసిన పెరుగు, ఐస్‌క్రీమ్ కప్పులు ..మట్టి కుండలు .. పనికి రాని ఊలు తదితర వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు

### ప్రత్యేక ప్రశంసలు

విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను పంద్రాగస్టు, జనవరి 26 సందర్భాల్లో ఒంగోలులో పోలీస్‌పేరెడ్ గ్రౌండ్‌లో జరిగే ఎగ్జిబిషన్లలో ప్రదర్శించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారిణి ఎం.సుమాంజలి పర్యవేక్షణలో క్రాఫ్టు టీచరు వివిధ కళాకృతులను తీసుకొచ్చి ప్రశంసలు పొందారు. గత జిల్లా కలెక్టర్ సుజాత శర్మ, పలువురు మంత్రులు విద్యార్థినుల కృషిని అభినందించారు.

- 2016లో ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన ప్రదర్శనకు పలువురు నుంచి ప్రశంసలు అందుకున్నారు. గుంటూరు పోలీస్‌గ్రౌండ్‌లో జరిగిన ప్రదర్శనలో ఏర్పాటుచేయగా పలువురు ఆసిక్తిగా తిలకించారు.
- ఇటీవల చినగంజాం విద్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు వచ్చి ప్రశంసించారు.



పాత హెల్మెట్‌లోని స్పాంజ్‌తో చేసిన తెల్లని పువ్వు

### ఆరేళ్లుగా శిక్షణ ఇస్తున్నా



చినగంజాం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో క్రాఫ్టు ఉపాధ్యాయినిగా గత ఆరేళ్ల నుంచీ చేస్తున్నా. ఇప్పటివరకూ వందలాది మందికి తర్ఫీదునిచ్చా. వృథాగా పడేసే సామగ్రితో వస్తువులు తయారీ చేయిస్తున్నాం. మార్కెట్‌లో ఎక్కువ ధరలకు లభ్యమయ్యే వాటికంటే మేలైన వాటిని తక్కువ ఖర్చుతో వృథా మెటీరియల్ వాడి తయారు చేస్తుంటాం. 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులందరికీ శిక్షణ ఇస్తున్నాం. ఏడాదికి 200 మంది చొప్పున ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి శిక్షణ ఇచ్చా. ఎస్‌వోతో పాటు ఉపాధ్యాయినుల సహకారంతో ముందుకెళుతున్నాం. **– మేరీ సౌభాగ్యం, క్రాఫ్ట్ ఉపాధ్యాయిని**



విద్యార్థినుల సృజనకు ప్రతిరూపాలు




చినగంజాంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

# చీకట్లో చిరు దివ్వెలు



- నిరుపేదల బతుకుల్లో వెలుగులు
- ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సహకారం
- లక్షన్నర మందికి నేత్ర చికిత్సలు
- రామానాయుడి స్వప్నం సాకారం



**వెంటాడే పేదరికం .. బతుకంతా అంధకారం ..దిశానిర్దేశం మృగ్యం ! ఇదీ కంటి చూపు లేని బడుగు జీవుల దీనస్థితి. ఇలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి. దివంగత సినీ నిర్మాత రామానాయుడు చేయూతతో కారంచేడులో ఏర్పాటైన ఈ నేత్రాలయం వేలాదిమందికి కొత్త జీవితాలు ప్రసాదిస్తూ ఆయన స్వప్నాన్ని సాకారం చేస్తోంది.**

కారంచేడు, పర్చూరు, న్యూస్‌టుడే:

నేత్ర సమస్యలకు చికిత్స చేసేందుకు ఆధునిక వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి పేదల పాలిట వరంగా మారింది. ప్రముఖ సినీ నిర్మాత, మాజీ ఎంపీ దివంగత డాక్టర్ డి.రామానాయుడు సహకారంతో కారంచేడులో వెంకటలక్ష్మి నేత్రాలయాన్ని 2002 జూన్ 7న ప్రారంభించారు. దాదాపు రూ.2 కోట్ల విలువైన 0.75 ఎకరాల స్థలం ఉచితంగా ఇవ్వడమే కాకుండా రూ.సుమారు రూ.50 లక్షలు వెచ్చించి భవనాన్ని రామానాయుడు నిర్మించి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి అప్పగించారు. జర్మనీ నుంచి రప్పించిన అధునాతన వైద్య పరికరాలతో వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలన్నీ స్థానిక ఆసుపత్రిలో ఉన్నాయి. అప్పటి నుంచి నిరంతరాయంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

### లక్షలాది మందికి నేత్ర పరీక్షలు

కారంచేడులోని నేత్రాలయంలో పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు, కంటి శుక్లాలకు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1.68 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 20,500 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో 15 వేల మందికి పైగా ఉచితంగా చేయించుకున్న వారే. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని కంటి సమస్యలున్న వారు కారంచేడులో చికిత్స కోసం వస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉండడంతో ఇక్కడికి వచ్చేందుకు చుట్టుపక్కల జిల్లాల వారు ఆసక్తి చూపుతున్నారు. వైద్యులు, సిబ్బంది ఓర్పు, నేర్పుతో సేవలందిస్తూ నేత్ర సమస్యలతో వచ్చే వారి అభిమానాన్ని పొందుతున్నారు.



నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగులు



కారంచేడులోని నేత్ర వైద్యాలయం





### ప్రాథమిక నేత్ర పరీక్షా కేంద్రాలు

కారంచేడు వెంకటలక్ష్మీ నేత్రాలయం పరిధిలో పలు ప్రాథమిక నేత్ర పరీక్షా కేంద్రాలు దశాబ్దకాలం క్రితం ఏర్పాటుచేశారు. ప్రకాశం జిల్లాలో పర్చూరు, మార్టూరు, బల్లికురవ, చినగంజాం, ఈపూరుపాలెం, వేటపాలెం, పంగులూరు, గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, కావూరు, నర్సాయపాలెం గ్రామాల్లో ఇవి పనిచేస్తున్నాయి. శిక్షణ పొందిన టెక్నీషియన్ ప్రాథమిక కేంద్రాల్లో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. అవసరమైతే కారంచేడు ఆసుపత్రికి సిఫార్సు చేస్తారు. ఇప్పటి వరకు లక్షల మందికి పైగా ఈ కేంద్రాల్లో కంటి పరీక్షలు చేయించుకున్నారు.



కంటి శుక్లాలకు చికిత్సలు చేసే ఆధునిక పరికరం

### జర్మనీ నుంచి ఆధునిక పరికరాలు

జర్మనీ నుంచి రప్పించిన ఆధునిక వైద్య పరికరాలు కారంచేడు నేత్రాలయంలో అందుబాటులో ఉన్నాయి. వైద్య పరీక్షలు, కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు వీటి ద్వారానే జరుగుతాయి. కంటి శుక్లాల శస్త్రచికిత్స చేసిన తర్వాత వచ్చే పొర తొలగించేందుకు యాగ్లెజర్ పరికరం, నీటికాసుల పరీక్ష కోసం హెచ్‌వీఎఫ్, కుట్టులేకుండా లేజర్ శస్త్రచికిత్స చేసే 'ఫేక్' పరికరం అమర్చారు. నిత్యం సగటున 70 మంది వరకు కంటి పరీక్షలు చేయించుకునేందుకు ఆసుపత్రికి వస్తుంటారు. నేత్ర సమస్యతో వచ్చే వారికి కనీసం 2 గంటలు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు 8 మంది వరకు కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు చేస్తారు. నెలకు సగటున 200 వరకు జరుగుతాయి.



నీటి కాసుల పరీక్షా పరికరం

### ఉచితంగానే వసతులు..

హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పనిచేసే వైద్యుల్లో ఒకరిని కారంచేడులో నియమిస్తారు. నేత్రాలయంలోనే నివాసం ఉండేలా ఏర్పాటు చేశారు. ఏడాదికి ఒక డాక్టర్ స్థానిక నేత్రాలయంలో పనిచేస్తారు. ప్రస్తుతం డాక్టర్ కొమ్మినేని ఉషాభాను నేత్ర పరీక్షలు, కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ఒక రోజు ముందుగానే రోగులు వస్తారు. వారికి నేత్రాలయంలోనే ఉచితంగా సౌకర్యం, భోజన వసతి సమకూరుస్తారు.

### తెల్లకార్డు లేకున్నా ఉచిత వైద్యం


తెల్లకార్డుతో పనిలేకుండా పేదవారందరికీ ఉచితంగా నేత్ర పరీక్షలు, కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఆర్థికంగా స్థితిమంతుల నుంచి మాత్రం నిర్ణీత సొమ్ము వసూలు చేస్తాం. ఇవన్నీ హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి పర్యవేక్షణలోనే జరుగుతాయి. 5 లక్షల మందికి కంటి పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఖర్చు లేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన సేవలు అందించాలన్నదే నేత్రాలయం లక్ష్యం. అందులో భాగంగానే అత్యంత ఆధునిక పరికరాలను జర్మనీ నుంచి తెచ్చి అమర్చాం.



\- వి.వాసుబాబు, వెంకటలక్ష్మి నేత్రాలయం పరిపాలనాధికారి

# ఆకలి తీర్చి... ఆప్తులుగా నిలిచి...

- బీద నారాయణులకు అన్నదానం
- రాధాకృష్ణ మందిర కమిటీ ప్రతినిధుల సేవాతత్పరత



అన్నపూర్ణశాల



పాపరాజుతోటలో ఉన్న రాధాకృష్ణ మందిరం

**అన్నం పరబ్రహ్మ స్వరూపం. నాలుగు అన్నం మెతుకులు వదిలేసినా పెద్దవారు ముందుగా చెప్పే మాట ఇది. దీన్నే స్ఫూర్తిగా తీసుకుని రాధాకృష్ణ మందిర కమిటీ క్షుద్బాధతో అలమటించే వారిని ఆదుకుంటోంది. పాపరాజుతోటలో కమిటీ ప్రతినిధులు దాతల సహకారంతో గత కొన్నేళ్లుగా నిత్యాన్నదానం క్రతువులా సాగుతోంది.**

చీరాల పట్టణం, న్యూస్‌టుడే:

చీరాల పాపరాజుతోటలో ఉన్న రాధాకృష్ణ మందిర ప్రతినిధులు పేదలకు నిత్యాన్నదానం చేస్తూ వారి జీవితాల్లో ఆనందం నింపుతోంది. ఎన్నో అవాంతరాలను అధిగమిస్తూ ఈ క్రతువును ముందుకు తీసుకెళుతున్నారు. ఆకస్మికంగా మొదలైన ఈ యత్నం నిరాటంకంగా కొనసాగుతోంది. ఓ రోజు మందిర కమిటీ ప్రతినిధులకు సుపరిచితుడైన నరసరావుపేటకు చెందిన మంచెళ్ల లక్ష్మీనారాయణ తనకు శ్రీకృష్ణుడు కలలోకి వచ్చి పేదలకు ప్రతి రోజు అన్నదానం చేయమని చెప్పినట్టు కమిటీ ప్రతినిధులకు చెప్పారు. దీనికి కొంతమంది ససేమిరా అన్నారు. 2011 సంవత్సరం ఆగస్టు 22న శ్రీకృష్ణ జయంతి సందర్భంగా అన్నదానం చేశారు. అప్పటి నుంచి వారానికి రెండు, మూడు రోజులు కొంత మంది పేదలకు, వృద్ధులకు అన్నదానం చేయడం ప్రారంభించారు. అనంతరం ఒక్కొక్కరూ సహకారాన్ని అందించేందుకు ముందుకు రావటంతో 2011 నవంబరు నెల నుంచి నిత్యాన్నదానానికి శ్రీకారం చుట్టారు. పండుగలు, ఇతర శుభదినాల్లో మరింత ఎక్కువమందికి అన్నప్రసాదం అందిస్తున్నారు.

### అన్నపూర్ణశాలలో...

నిత్యాన్నదానం ప్రారంభం కావడంతో మందిరం వద్ద స్థలం సరిపోకపోవటంతో అన్నపూర్ణశాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో రాధాకృష్ణ మందిర అన్నపూర్ణశాల భవనాన్ని రెండేళ్ల క్రితం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇక్కడ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. పేదలకు నిత్యాన్నదానంతోపాటు పలు వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి ఉచితంగా మందులను కూడా అందజేస్తున్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. శాశ్వత, ప్రధాన దాతలు దీనికి సహకారం అందిస్తున్నారు. నెలకు ఈ కార్యక్రమానికి 30 వేల నుంచి 50 వేల వరకు వెచ్చిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. నాణ్యతతో కూడిన భోజనం, రుచికరమైన కూరలతో అందిస్తున్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం



మందిరంలో రాధాకృష్ణులు

### దాతలు ముందుకు రావటం అభినందనీయం



మొదట నిత్య అన్నదానం చేయాలంటే సాధ్యమౌతుందా అని కమిటీ ప్రతినిధులు సందేహించాం. చిన్నగా కార్యక్రమం ప్రారంభించటంతో దాతలంతా ఒక్కొక్కరుగా జమకూడారు. అన్ని దానాలలో అన్నదానం గొప్పదని తెలుసుకున్న మాకు ఇటువంటి సేవ చేయటం ఎంతో సంతృప్తినిస్తోంది. నాతో పాటు, కమిటీ ప్రతినిధులు, దాతలకు ఎనలేని సంతోషాన్నిస్తోంది.

**– నల్లూరి బ్రహ్మం, అధ్యక్షుడు, శ్రీ రాధాకృష్ణ మందిర కమిటీ**

### చాలా ఆనందంగా ఉంది




నేను ఏపీఎస్‌పీడీసీఎల్‌లో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశా. అనంతరం ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనే ఉద్దేశంతో రాధాకృష్ణ మందిరానికి ప్రతి రోజు వస్తుంటాను. నావంతు సాయంగా శాశ్వత అన్నదానానికి రూ.50వేలతోపాటు అన్నపూర్ణశాల నిర్మాణానికి నా వంతు సహకారాన్ని అందజేశా.

**- గాదెంశెట్టి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉద్యోగి, అన్నదాన కమిటీ ఛైర్మన్**

# శ్రమజీవులకు భరోసా!

- ఉపాధి కూలీలకు ప్రభుత్వం అండ



**ఎండకు ఎండుతూ .. వానకు తడుస్తూ శ్రమనే నమ్ముకున్న బడుగు జీవులను ఆదుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. అనారోగ్య సమస్యలు తలెత్తినా పనిచేసే సమయాల్లో ప్రమాదవశాత్తూ మరణించినా ఆ కుటుంబం వీధిన పడకుండా ఆదుకుంటారు. భవన నిర్మాణ కార్మికులకు వర్తించే బీమా విధానాలను వీరికీ వర్తింపచేసి లబ్ధి చేకూరేలా సరికొత్త విధానాన్ని అమలు చేస్తోంది.**

– న్యూస్‌టుడే, పెద్దారవీడు

### ఎవరెవరు అర్హులు...

ఉపాధి హామీ పథకం గుర్తింపు కార్డు ఉండి ఏడాదిలో 90 రోజులకు తక్కువ కాకుండా పనిచేసిన వారికి ఈ పథకం వర్తిస్తుంది. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేస్తుంది.

### ప్రయోజనాలు ఇవీ..

దరఖాస్తుదారుడు సాధారణంగా మృతి చెందితే ప్రభుత్వం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేస్తుంది.

- మహిళ అయితే ఆమె ప్రసూతి సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు సాయం అందుతుంది.
- ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.50 వేల ఆర్థిక సాయం అందుతుంది.
- దరఖాస్తుదారుడు అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే రూ.9 వేలు సాయం అందజేస్తారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

### నమోదు ఇలా...

కార్మికుల బీమా పథకం ఉపాధి కూలీలు పొందే వీలుంది. ఒక్కొక్కరు మొత్తం రూ.110 చలానా బ్యాంకులో తీయాలి. అనంతరం ఉపాధి సిబ్బంది లేదా కార్మికశాఖ అధికారుల వద్ద ఉన్న దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి ఆధార్, రేషన్ కార్డు నకలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతచేసి సంబంధిత సాంకేతిక, క్షేత్రస్థాయి పర్యవేక్షకులకు అందజేయాలి. వారు అక్కడి నుంచి కార్మిక శాఖ కార్యాలయానికి చేరవేస్తారు. లేదంటే దరఖాస్తుదారుడు నేరుగా కార్మికశాఖ అధికారులకు అందజేయవచ్చు.

### అందరూ దరఖాస్తు చేసుకోవాలి

ఒక్కో కూలీకి అయిదు సంవత్సరాలకు రూ.110లు పెద్ద మొత్తం కాదు. ప్రతి ఒక్క కూలీ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రమాదవశాత్తు ఎవరైనా మృతి చెందినా, అనారోగ్యం బారినపడినా కుటుంబంలో మిగిలిన వారిపై భారం పడే అవకాశం లేకుండా ప్రభుత్వం నుంచి సాయం అందుతుంది.

**– నాగేశ్వరరావు, ఎంపీడీవో, పెద్దారవీడు**